కొత్త రచయితలు

# తియ్యని కోరిక

పి. శైలజ

ప్రకృతి అందాలకు రూపం వచ్చినట్లుగా తన ఫ్రెండ్స్‌తో బస్‌స్టాప్‌లో నిలుచుని ఉంది హరిత. ఫ్రెండ్స్‌తో మాట్లాడుతున్న హరిత కళ్ళలో కన్నె మెరుపులు. చేపపిల్లల్లా చలిస్తున్నాయి హరిత కళ్ళు. పద్దెనిమిదేళ్ళవుండి డిగ్రీ చదువుతున్న ఆ పడుచుపిల్ల ల్లో యవ్వనోత్సాహం, అల్లరి కవిత్వానికి యవ్వనం వచ్చినట్లుగా వుంది వారి ప్రవర్తన. అల్లరిగా మెరిసే హరిత కళ్ళు హఠాత్తుగా చలించడం మానేశాయి. మోటార్ బైక్‌లో తన ముందు నిలిచి చిలిపిగా నవ్వుతున్న వినోద్! "ఛీ... నువ్వా..." అన్నట్లు విసురుగా చూపులు తిప్పుకున్నా లోపల ఏదో ఎగ్జయిట్‌మెంట్. కథల్లోలా తన వెంటపడి తన చుట్టూ తిరిగే అందమైన హీరో! తనకోసం ఎన్నో త్యాగాలు, సాహసాలు చేసిన వినోద్ చేతుల్లో... తను...!

ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది హరిత. ఇదంతా కలేనా? అయినా ఎంత బాగుంది... ఇలాంటి కలలే దాదాపు పదేళ్ళ కితం వచ్చేవి. అప్పుడు అదో ఆనందం... ఉత్సాహం... టీనేజ్‌లో ప్రతివక్కరూ ఏదో ఒక సమయంలో అలగా ఫీల్ అవుతారు. కానీ ఈ వయసులో... ఇలాంటి కల రావడం ఉత్సాహం బదులు భయాన్ని కలుగజేస్తుంది. ఎందుకంటే... ఆకు రాలుతున్న తన యవ్వనంలో... వసంతం ఇక పూస్తుందా? దీని కంతటికీ కారణం ఎదురింటి వినోద్... తనను ఇంత టెన్షన్‌కు గురిచేస్తున్న ఈ వినోద్ వారం రోజుల ముందు "ఎక్స్‌క్యూజ్‌మీ... మేడమ్... మీరు... నాకంటే పెద్దవారు... మిమ్మల్ని చూస్తుంటే గౌరవించాలనిపిస్తోంది. కానీ మనిషి బుద్ధి కోతిలాంటిది... అలాంటి నా మనసు మిమ్మల్ని చూస్తుంటే రకరకాల భావాలతో సతమతవుతుంది. మీకు ఇంత వయసువున్నట్లు కనిపించరు. ఎంతో బాగుంటారు. ఎంత కంట్రోల్ చేసుకుందామన్నా నా మనసు మిమ్మల్ని ఆరాధించమంటోంది... అలా అని నన్ను చెడ్డవాడుగా అనుకోకండి. మీ నుండి నేను ఏమీ ఆశించను... మిమ్మల్ని ఆరాధనగా చూడటం తప్ప..." ఆ మాటలు పదేళ్ళుగా గృహిణి బాధ్యతలతో విసిగి, అలసిపోయిన హరిత మనస్సు మీద తారకమంత్రంలా పనిచేశాయి. తనకు తెలీకుండానే మరింత శ్రద్ధగా తయారౌతోంది. తనను చూసి మెరిసే వినోద్ కళ్ళు చూస్తే అదో తృప్తి. ఇది తప్పు కాదు... జస్ట్ చూపులవరకే ఈ ఆరాధన... ఇంతలో తన పాతివ్రత్యం పోయేది లేదు అనుకునేది. వినోద్ మాటలు విన్నప్పటినుండి తొలకరిజల్లుకు తడిసి పులకరించే బీడులావుంది హరిత మానసిక పరిస్థితి. అలాంటి స్థితిలోనే ఇలాంటి కల. తను అందమైనదే! పదేళ్ళ క్రితం... వివాహానికి పూర్వం తను ఎంతోమంది కుర్రవాళ్ళను ఆకర్షించింది. కొందరినుండి ప్రేమలేఖలు అందుకుంది కూడా! ఆ చిరువయసులో అలా అబ్బాయిలు ప్రేమలేఖలు రాస్తుంటే మనసులో అలజడిగా ఉండేది. కథల్లోలా తన కోసం క్రేజీగా తిరిగే యువకుడిని భర్తగా ఊహించుకునేది. చిత్రం! పెళ్ళయ్యాక ఏ కొద్ది రోజులు థ్రిల్ అనుభవిందో... తరువాత బాధ్యతలు, బరువులు,




పిల్లలు తనలోని సెన్సిటివ్‌నెస్‌ను జడత్వంలోకి నెట్టేశాయి. అపుడపుడు మనస్సు స్పందించినా సమస్యలు రాక్షసుల్లా వాటిని మింగేసేవి. అలాంటి సందర్భంలో అనుకోకుండా వినోద్ రావడం. తిరిగి వసంతం వచ్చినట్లయింది. కాలేజీ రోజులు ఆ ఊహాలు అన్నీ గుర్తుకు వస్తున్నాయి.

పక్కకు తిరిగి చూసింది. గుర్రుపెట్టి నిద్రపోతున్న భర్త శశిధర్, అటుపక్క పిల్లలు... ఒక రకమైన యాంత్రిక జీవనం... ఉదయం లేచినప్పటినుండి తనను కసురుతూ, విసుక్కుంటూ పిల్లలకు, అతనికి అన్నీ అమర్చే యంత్రం అనే దృష్టితోనే చూస్తాడు భర్త. ఒక చల్లని మాట... తియ్యని పలకరింపు ఏమీ వుండవు... పెళ్ళయిన కొత్తలో ఎంత బాగా చూసుకునేవాడు. ఈ మధ్య అసలు తను ఓ పనిమనిషిలా కనిపిస్తుంది కాబోలు... అలాంటి శశిధర్ మారితే... పెళ్లయిన కొత్తలోలా తనను ప్రేమగా పిలిస్తే... అలా పిలవాలంటే తను ఏం చెయ్యాలి?... ఆ రాత్రంతా ఆలోచిస్తూనే వుండిపోయింది.

* * *

ఆఫీసునుంచి వచ్చి ఫైల్స్ ముందేసుకుని సీరియస్‌గా వాటితో కుస్తీ పడుతున్న శశిధర్ ముందు ఒక కవరు పెట్టింది హరిత. పిల్లలు లేరు. ట్యూషన్‌కు వెళ్లారు. ఇల్లు నిశబ్దంగా ఉంది.

"ఏమిటిది?" చిరాగ్గా అడిగాడు.

"తీసి చూడండి... మీకే తెలుస్తుంది?"

"ఏమిటో వెధవ సస్పెన్స్.... చెప్పమంటుం

టే...'' కసురుకుంటూ ఆ కవరు చేతికి తీసుకున్నాడు.

''హు... ఇంతకంటే సరసంగా మాట్లాడటం మీకు తెలిసి ఏడిస్తే కదా! పిచ్చికుక్క మొరిగినట్లు మొరగడం... రాత్రిపూట కూడా ఆ కాస్సేపూ పందుల్లాగా దొర్లడం'' కోపంగా అనుకుంది హరిత.

కవరులోనుండి కాగితాలు తీసి చదువుతున్న శశిధర్ మొహం మొదట ఆశ్చర్యంగానూ తరువాత రకరకాల రంగులతోనూ నిండిపోయింది.

హరితగారూ,

మిమ్మల్ని చూసిన క్షణం ఎలాంటిదో ఆ క్షణానికి శతకోటి అభినందనలు. వర్ణింపనలవి కాని అనుభూతి పొందిన క్షణమది. మీకు నాకు మధ్య వున్న వయసు వ్యత్యాసం, తారతమ్యం ఏవీ గుర్తుకు రాని క్షణమది. మీ నవ్వు చూసి వెయ్యి మల్లెలు విరిసినట్లు, వెన్నెల కురిసినట్లు... రకరకాల భావాలు. మీకెలా చెప్పను... మాటలకందని ఆ భావాలను. మీకు పెళ్లయిందని, పిల్లలున్నారని తెలిసి ఆశ్చర్యపోయాను. ఎందుకంటే అంత వయసున్న వారిలా కనిపించరు కాబట్టి.... అయినా ఆరాధనకు ఇవేవీ అడ్డురావుగా... మిమ్మల్ని భర్తగా పొందిన శశిధర్ గారు ఎంత అదృష్టవంతులో కదా! సౌందర్య దేవత సాన్నిధ్యంలో నిరంతరం గడిపే భాగ్యం ఎంతమందికి లభిస్తుంది? మీ కళ్లలోని కరుణ, మీ మాటల్లోని మెత్తదనం స్త్రీ జాతికే వన్నె తెచ్చే మీ సహనం... ఉదయం లేచినప్పటినుండి చిరుబురులాడే శ్రీవారిని సహనంతో భరిస్తూ, ఇంటిపనులు, పిల్లలపనులు ఓపికగా చేసుకుంటూ ఎంతో సహనం చూపే మీరంటే బోలెడంత జాలి... మరెంతో ఆపేక్ష. ఇంత సహనమూర్తి అయిన భార్యను శశిధర్ గారు ఎందుకు గుర్తించడం లేదు అని ఆలోచిస్తూవుంటాను. ఇలా ఉత్తరాలు రాస్తున్నానని నన్ను చెడుగా అర్థం చేసుకోకండి. మీరంటే నాకు ఆరాధనా, ఇష్టం... అంతే! మీ నుండి నేను ఏమీ ఆశించను... మీ చిరునవ్వు తప్ప... నా అభిమానాన్ని అపార్థం చేసుకోకండి. మీరు నిరంతరం సుఖసంతోషాలతో వర్థిల్లాలని కోరుతూ...

మీ దాసుడు
వినోద్

ఇలాంటివే మిగిలిన రెండు మూడు ఉత్తరాలు కూడా!

అవన్నీ చదివిన శశిధర్ మతిపోయినవాడిలా అయ్యాడు.

''ఏమిటే... ఇది... వాడిని... ఆ వినోద్‌గాడిని చంపేస్తాను...'' రౌద్రంగా అన్నాడు.

''ఆగండి... అర్థం చేసుకోకుండా వాడిని చంపుతానంటూ వెళ్ళారంటే మనమే అల్లరి పాలవుతాము. ఉత్తరాలు చదివారుగా... ఎదురింటి వినోద్ రాశాడు. వాటి సారాంశం గ్రహించారుగా... ఎవరికయినా ఈ లెటర్స్ చూపిస్తే మనమే వెర్రివాళ్లమవుతాము. అందులో అసభ్యత ఎంతమాత్రం లేదు. అతనికి నన్ను చూస్తే ఆరాధనట... పైగా నాకంటే చిన్నవాడు. వెకిలిగా అసలు ప్రవర్తించడు. నన్ను ఎంతో గౌరవంగా చూస్తాడు. కవిత్వం మాత్రం రాస్తాడు. ఇక మీరు వెళ్లి గొడవ పెడితే ఏం జరుగుతుంది? అల్లరిమాత్రం మిగులుతుంది. వెకిలి వేషాలేస్తే అతడిని అందరితో తన్నించవచ్చు. కానీ... ఎంతో మర్యాదగా ఉంటాడు. అతనికంటే పదేళ్లు పెద్దదాన్నయినా నామీద ఆరాధన ఏమిటో... ఏ పని చేసినా ఆలోచించి చెయ్యండి...'' అంటూ లోపలికెళ్లిపోయింది. శశిధర్ శిలలా కూర్చుండిపోయాడు.

అతని మనసు పదేళ్ల వెనక్కు వెళ్లిపోయింది. తమ కాలేజీ రోజులు, అమ్మాయిల చుట్టూ తిరగడం, ప్రేమలేఖలు రాయడం, ఆరాధించడం.... ఇలాగే తామంతా పెళ్లయిన హిస్టరీ లెక్చరర్ అమృతా మేడమ్ అంటే పడిచచ్చేవాళ్లు. అమృతా మేడమ్ మిగిలిన లెక్చరర్లకంటే చిన్నది. చాలా అందంగా వుండేది. పెళ్లయిందని తెలిసినా అబ్బాయిలకు ఆమె అంటే పిచ్చి. ఆమె క్లాస్ మాత్రం మిస్ చేసేవాళ్ళు కాదు. వాళ్లకే కాదు... తమకంటే వయసులో పెద్దదయినా, పెళ్లయినా, అమృతా మేడమ్ అంటే తనకెంత ఆరాధన. ఆమె లెసన్ చెప్పేటప్పుడు ఆ పెదవుల కదలిక ఆ కళ్లు తిప్పడం ఎంతో అద్భుతంగా ఉండేది. ఆమె మీద తను పేజీల కొద్దీ కవిత్వం రాసేవాడు. కాని ఆమెకు ఇవ్వాలంటే భయం... ఆమె తనకంటే పెద్దది... పైగా తన గురువు... ఎవరికైనా తెలిస్తే నవ్వులపాలవుతాడనే ఉద్దేశంతో తన ఆరాధనను గుప్తంగానే దాచుకున్నాడు. అలాంటి స్థితిలో ఇపుడు వినోద్ ఉన్నాడా? చిత్రంగా... వినోద్ మీద కోపం రావడం లేదు. యవ్వనంలో ఉన్నప్పుడు తమను తాము చూసుకుంటున్నట్లుగా వుంది.

❋ ❋ ❋

ఆ రాత్రి పని ముగించుకుని బెడ్‌రూమ్‌లోకి వచ్చిన హరితను తదేకంగా చూడసాగాడు శశిధర్. పసిమి రంగు శరీరం. తీర్చిదిద్దిన కనుముక్కుతీరు... ఇద్దరు పిల్లలైనా తరగని వన్నె... జడలో నుండి ఒక పక్కగా వేళ్లాడుతున్న మల్లెలు. అందంగా, హుందాగా... తన భార్య హరితేనా? ఇన్నిఅందాలను దగ్గరుంచుకుని ఇన్ని ఏళ్లూ తమ ఆఫీసు ఇంటి బాధ్యతలు... పిల్లలు అంటూ యాంత్రిక జీవనం గడుపుతూ ఎంత వృథా చేశాడు. పెళ్లయిన కొత్తల్లో ఏమి ఎంజాయ్ చేశారో ఏమో అంతే! ఇన్నేళ్లూ... హడావిడిగా హరితను విసుక్కుంటూ కసురుకుంటూ గడిపేశాడు. వినోద్ వచ్చి తన భార్యలోని అందాలను చూపేదాకా తెలుసుకోలేని మూర్ఖుడయ్యాడు. 'థ్యాంక్స్ టూ వినోద్' అనుకుంటూ.

''హరీ... ఇలారా...'' అంటూ పిలిచాడు.

ఆ పిలుపుకు హరితలో సప్తసముద్రాలు పొంగినంత సంతోషం. ఈ మధ్యకాలంలో తియ్యని అతని పిలుపుకు, పలకరింపుకు నోచుకోని హరిత ఎదలో కోటి కోయిలల గానంలా వుంది అతని పిలుపు. ఎన్నిఏళ్లకు అతడింత ఆప్యాయతగా పిలుస్తున్నాడు. మెరుపులా అతడి చేతుల్లో వాలిపోయింది.

హరితను ముద్దుల్లో ముంచెత్తుతూ ''ఎంత మూర్ఖుడిని కదూ హరి నేను? ... నీలోని గొప్పదనాన్ని, అందాన్ని గమనించలేకపోయాను. ఐ... లవ్ యూ హరీ... ఈ ఆర్థిక సమస్యలు... బాధ్యతలు నాలోని ప్రేమను డామినేట్ చేశాయే కానీ... భార్యగా నిన్ను కష్టపెట్టాలని నేనెప్పుడూ అనుకోలేదు... పెళ్లయిన కొత్తల్లోలా... ఇప్పటికీ.... ఎప్పటికీ నువ్వంటే నా కిష్టం... హరీ...'' అన్నాడు.

''ఏమండీ... నాకెంత సంతోషంగా వుందో తెలుసా? ఈ మధ్య మీనుండి చిదిలింపులు, కసిరింపులు మాత్రమే అనుభవించిన నేను... మీ తియ్యని పిలుపు కోసం తపించిపోయాను. నా కలలు... నా కోరికలు ఈ రోజు నిజమయ్యాయి. మీరు ఆప్యాయతగా వుంటే చాలు ఎన్ని ఆర్థిక బాధలు, ఇబ్బందులయినా ఎదుర్కొంటాను'' అంది.

''ఇకమీదటిలాగే వుందాము హరీ... ఈ సారి వినోద్ ఉత్తరం రాస్తే అతడితో నేను మాట్లాడుతాను'' అన్నాడు శశిధర్.

హరితకు సంతోషంగా వుంది. తనను ఆరాధించే వినోద్‌తో తన సమస్య చెప్పుకుంది. శశిధర్‌ను మార్చడానికే వినోద్ అలా ఉత్తరాలు రాసాడని హరిత తియ్యని కోరిక తీరగానే... శశిధర్‌లో మార్పు రాగానే వినోద్ ఇక ఉత్తరాలు రాయడని, కేవలం హరితకు శ్రేయోభిలాషిగా మిగిలిపోతాడని హరితకు ఒక్కదానికే తెలుసు. ●

